విద్యుత్ కోతలతో విలవిల

- ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ కరవు
- అధికలోడుతో సరఫరాకు తరచూ అంతరాయం

పొన్నూరు: పట్టణ ప్రజలు విద్యుత్ సమస్యలతో నిత్యం సతమతమవుతున్నారు. తరచూ లో ఓల్టేజీ సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ఎప్పుడు చూసినా ఇళ్లలో గుడ్డి దీపాలే దర్శనమిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా కోతలు విధించడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొన్ని వీధుల్లో రోజుకు పదిసార్లు సరఫరా నిలిచిపోతుంది. కొంచెం గాలి మొదలై చినుకు పడితే ఇక పట్టణ వాసులకు నరకం కనబడుతోంది. సరఫరా ఎప్పుడు పునరుద్ధరిస్తారో ఎవరూ చెప్పలేని దుస్థితి ఉంటుందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని 31 వార్డుల పరిధిలో తరచూ లోఓల్టేజీతో రోజులో పలుసార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు వాపోతున్నారు. సాధారణ రోజుల్లో ప్రధాన తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించుకోవాల్సిన ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతోనే గాలులు వీచినపుడు కొమ్మలు విరిగి తీగలపై పడుతుండటంతో ఈ సమస్య ఎదురవుతోందని చెప్తున్నారు. ప్రధానంగా 27వ వార్డు ఇటికంపాడు రోడ్డు ప్రాంతంలో లో ఓల్టేజీ కారణంగా గత నాలుగు నెలల నుంచి విద్యుత్ సమస్యను ఎదుర్కొంటున్నామని స్థానికులు చెబుతున్నారు. రాత్రి సమయాల్లో ఎక్కువ సార్లు అంతరాయం కలుగుతుండటంతో జాగారం తప్పడంలేదంటున్నారు. ఏసీలు, ఫ్యాన్లు, లైట్లు పూర్తి స్థాయిలో పని చేయడం లేదని అంటున్నారు. ఒక్కోసారి రాత్రంతా సరఫరా నిలిపేసిన సందర్భాలు ఉంటున్నాయన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడు పడటంతోనే సమస్య ఉత్పన్నమవుతుందని చెబుతున్నారు. విద్యుత్ అధికారులకు ఎన్నోసార్లు సమస్యపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



27 వార్డులో విద్యుత్ స్తంభంపై అధికంగా ఉన్న కనెక్షన్లు, సమస్యలకు కారణమైన ట్రాన్స్‌ఫార్మర్


8వ వార్డులో విద్యుత్ స్తంభంపై అల్లుకున్న తీగలు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

పొన్నూరు పట్టణంలో అనధికార విద్యుత్ కోతలు అరికట్టేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటాం. పాత పొన్నూరు సబ్ స్టేషన్ పరిధిలో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాం. ఈ క్రమంలో గత రెండు రోజులుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వార్డుల్లో విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కరిస్తాం.

– కె. వెంకయ్య, విద్యుత్ ఏఈ, పొన్నూరు

లోఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు



గత కొన్ని నెలలుగా లో ఓల్టేజీ సమస్య కారణంగా విద్యుత్ సమస్యను ఎదుర్కొంటున్నాం. ట్రాన్స్‌ఫార్మర్‌లో అధిక లోడు ప్రభావంతో సమస్య ఏర్పడుతోంది. రాత్రిళ్లు తరచూ లో ఓల్టేజీ సమస్య కలుగుతోంది. ఫ్యాన్లు తిరగక, ఏసీలు పనిచేయక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

– ఫజల్, 27వ వార్డు

క్లుప్తంగా

పిచ్చి మొక్కలు తొలగించండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



తెనాలిఅర్బన్: పిచ్చి మొక్కలను వెంటనే తొలగించి ఆహ్లాదకరంగా ఆవరణను తయారు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. రజక చెరువు వద్ద ఉన్న పార్కును శనివారం ఆయన పరిశీలించారు. పార్కును శుభ్రంగా ఉంచడంతో పాటు వాకర్స్‌కు అనుకూలంగా ఉంచాలన్నారు. వారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట హార్టికల్చర్ అధికారి శేషుబాబు, పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

విద్యార్థులకు జామెట్రీ బాక్సుల పంపిణీ



తెనాలిరూరల్: మండలంలోని బుర్రిపాలెం గ్రామానికి చెందిన శ్రీ సర్వదేవ పరంజ్యోతి మానవ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు జామెట్రీ బాక్సులను శనివారం పంపిణీ చేశారు. గ్రామంలోని ఘట్టమనేని నాగరత్నమ్మ రాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 130 మంది విద్యార్థులకు బాక్సులను అందజేశారు. సమితి సభ్యులు, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం



తెనాలి: డాక్టర్స్ డే సందర్భంగా రెయిన్‌బో ట్రస్ట్, తెనాలి, డాక్టర్ లతాస్ డయాబెటిక్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో జులై ఒకటో తేదీన ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు డాక్టర్ డి.జీవనలత తెలియజేశారు. ప్రకాశం రోడ్డులోని లతాస్ డయాబెటిక్ కేర్‌లో నిర్వహించే శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించి వివరాలను తెలిపారు. వైద్య శిబిరంలో బ్లడ్ షుగర్, థైరాయిడ్ స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా చేసి, అవసరమైన మందులను ఉచితంగా ఇస్తామని తెలిపారు. స్త్రీలకు సంబంధించిన అన్ని వ్యాధులకు ఉచితంగా కన్సల్టేషన్, మందులు ఇవ్వనున్నట్టు వివరించారు. తెనాలి, పరిసరాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌కు డాక్టరేట్



చుండూరు(తెనాలి): బాపట్ల జిల్లా చుండూరు మండల గ్రామం మోదుకూరులోని వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)గా పనిచేస్తున్న మాదాసు చంద్రశేఖర్‌కు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ డాక్టరేట్ లభించింది. 'మెటా-కాగ్నిన్, అచీవ్‌మెంట్ మోటివేషన్ ఆఫ్ సెకండరీ స్కూల్ పీపుల్స్ ఇన్ రిలేషన్ టు అకడెమిక్ అచీవ్‌మెంట్' అనే అంశంపై సమర్పించిన పరిశోధనకు యూనివర్శిటీ ఎడ్యుకేషన్ విభాగం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. డాక్టర్ జీఆర్ ప్రియదర్శిని మార్గ నిర్దేశనంలో ఈ పరిశోధన చేశారు. వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటేశ్వర్లు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

రేపు 10,422 మందికి పింఛన్ల పంపిణీ

తాడికొండ: సామాజిక భద్రతా పింఛన్లు సోమవారం నుంచి ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో అనురాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీన అందించే ఎన్‌టీఆర్ ఆరోగ్య భరోసా పింఛన్ ఈ నెల సచివాలయ సిబ్బంది ఉదయం 6 గంటల నుంచే అందించనున్నట్లు పేర్కొన్నారు. తాడికొండ మండలంలో మొత్తం 10,422 మంది లబ్ధిదారులకు గాను మొత్తం రూ.7,12,87,500 నగదు పంపిణీ జరగనుందని ఆమె తెలిపారు.

దోగిపర్రు గ్రామంలో 'బడిబాట'

మేడికొండూరు : మండల పరిధిలోని దోగిపర్రు గ్రామంలో శనివారం ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ అంగన్‌వాడీ ద్వారా పౌష్టికాహారంతోపాటు, విద్య అందిస్తారన్నారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించడం వల్ల వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన వారవుతారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివరామ్, శ్రీనివాసరావు, అంగన్‌వాడీ టీచర్లు తోట శివపార్వతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

ఎన్‌పీటీఈఎల్ ఫలితాల్లో వీవీఐటీ విద్యార్థుల ప్రతిభ

పెదకాకాని: ఎన్‌పీటీఈఎల్ (నేషనల్ ప్రోగ్రాం ఫర్ టెక్నాలజీ ఎన్హాన్స్‌మెంట్ లెర్నింగ్) పరీక్ష నందు వీవీఐటీ విద్యార్థులు, అధ్యాపకులు ఉత్తమ ప్రదర్శన చూపి సర్టిఫికెట్లు పొందినట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ అధునాతన పద్ధతులను విద్యార్థులకు, అధ్యాపకులకు పరిచయం చేస్తూ దేశ ప్రతిష్టాత్మక సంస్థలైన ఐఐటీ, ఐఐఎస్‌సీ వంటి సంస్థల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణనివ్వడం జరిగిందన్నారు. అనంతరం నిర్వహించు ఎన్‌పీటీఈఎల్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరచిన 61 మంది దేశంలో ప్రథమంగా నిలవగా, 1592 మంది వీవీఐటీ విద్యార్థులు, 16 మంది అధ్యాపకులు సర్టిఫికెట్లు పొందారన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిలబస్‌తో పాటు ఆధునిక సాంకేతిక కోర్సులలో విద్యార్థులు శిక్షణ పొందడం వల్ల సాంకేతికత నందు మెరుగైన ఫలితాలు పొందవచ్చన్నారు. సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులను, అధ్యాపకులను వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ, ఎన్‌పీటీఈఎల్ సంధానకర్త డాక్టర్ కేదార్ మల్లిక్ అభినందించారు.


అధ్యాపకునికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్ మల్లికార్జునరెడ్డి, చైర్మన్ విద్యాసాగర్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి

శేకూరులో 'నేను బడికిపోతా' ర్యాలీ

శేకూరు(చేబ్రోలు): బడి ఈడు వయస్సు కలిగిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు అన్నారు. మండలంలోని శేకూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో నేను బడికిపోతా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారుల్లో ప్లకార్డులు, ఫ్లెక్సీలు చేతపట్టుకొని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. బడి బయట ఉన్న పలువురు పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు పంపేందుకు అంగీకరించేలా చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు రాయల సుబ్బారావు, ఏవీహెచ్ ప్రసాద్‌లు మాట్లాడుతూ 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు కలిగిన బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించటానికి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రోత్సాహకాలు, తగిన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు ప్రసాద్, జోసెఫ్ సుధీర్ బాబు, గోపాలకష్ణయ్య, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.


శేకూరు గ్రామంలో నేను బడికిపోతా ర్యాలీలో ఎంఈవోలు, ఏవీహెచ్, హెచ్ఎంలు

అవకతవకలు లేకుండా రేషన్ సరఫరా

పెదకాకాని: చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ సరఫరాలో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా కేసులు నమోదు చేసి, తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దారు పెల్లూరి రత్నం హెచ్చరించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం చౌక ధరల దుకాణం డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ చౌక ధరల దుకాణం డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు జులై నెలకి సంబంధించి కార్డుదారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడినట్లు ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందినా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎప్పటి మాదిరిగానే ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ రేషన్‌కార్డులు ఉన్న వారందరికీ రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల ఉప తహసీల్దారు చలమయ్య, రెవెన్యూ అధికారులు, రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దారు రత్నం

ఉత్తమ సేవలతో ప్రజా మన్ననలు

చేబ్రోలు: ప్రభుత్వ ఉద్యోగులుగా సుదీర్ఘకాలం పనిచేసి, ప్రజల మన్ననలు పొందిన చేబ్రోలు పంచాయతీరాజ్ ఏఈ గోలి వరదరాజులు, శలపాడు పంచాయతీ కార్యదర్శి తుంగల జయప్రకాశరావు అందరికీ ఆదర్శణీయమని ఎంపీపీ కె.సాహితి పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఏఈ వరదరాజులు, శలపాడు పీఎస్ జయప్రకాశరావు పదవీ విరమణ సందర్భంగా శనివారం వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఇద్దరు ఉద్యోగుల పదవీ విరమణ సందర్భంగా జరిగిన అభినందన సభలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్ మాట్లాడుతూ 42 సంవత్సరాలుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన గోలి వరదరాజులు ఉత్తమ సేవలు అందించారన్నారు. శలపాడు పంచాయతీ కార్యదర్శిగా తుంగల జయప్రకాశరావు ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.జ్యోతి, కారంచేడు ఎంపీడీవో బాబురావు, ఈఓపీఆర్డీ జి.శ్రీనివాసరావు, సూపరింటెండ్ ఉమాదేవి, చేబ్రోలు, వడ్లమూడి పీఎస్‌లు ఎం.శ్రీనివాసరావు, వీపీప ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల పరిషత్ ఉద్యోగులు శాలువాలు, మెమోంటోలతో ఘనంగా విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు.


పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానిస్తున్న ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు

కల్తీ విత్తనాలను అరికట్టాలి

పొన్నూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు సబ్సిడీ విత్తనాలు వెంటనే అందించి, మార్కెట్‌లో కల్తీ విత్తనాలను అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పొన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జక్కా రవీంద్రనాథ్ అన్నారు. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎన్నడూ చూడని నష్టాలు చూసారని, ఈ ఏడాది వ్యవసాయ పనులు ప్రారంభమైన తరుణంలో రైతులకు ప్రభుత్వం భరోసాగా నిలవాలన్నారు. ముందుగా సబ్సిడీ విత్తనాలు అందించి రైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు. అలాగే కల్తీ విత్తన మాఫియాపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. సకాలంలో సాగునీరందించి వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు.

పరుచూరి రాఘవేంద్రరావుకు నివాళి



తెనాలి: పట్టణంలోని శ్రీ అరవింద ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ పరుచూరి రాఘవేంద్రరావు సంస్మరణ సభ శనివారం సాయంత్రం శ్రీ అరవింద విద్యాకేంద్రం ప్రాంగణంలోని ధ్యాన మందిరంలో నిర్వహించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యావేత్తగా రాఘవేంద్రరావు సమాజ హితం కోసం పని చేశారని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన చైతన్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి మాట్లాడుతూ రాఘవేంద్రరావు ఉత్తమ విలువలతో జీవించిన ఆదర్శమైన వ్యక్తిగా కొనియాడారు. అరవింద విద్యాకేంద్రం డైరెక్టర్ కె.సంపూర్ణ, ప్రొఫెసర్ కొడాలి రాంబాబు, డాక్టర్ పాలడుగు ఉమా మహేశ్వరరావు, మొవ్వా సత్యనారాయణ తమ ప్రసంగాల్లో రాఘవేంద్రరావుతో తమకు గల అనుబంధాన్ని స్మరించుకున్నారు. తొలుత రాఘవేంద్రరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. యడ్ల మోహనరావు, వి.నాగమల్లేశ్వరి, వై.పద్మశ్రీ,, ఆర్.నిర్మలాకుమారి, రాఘవేంద్రరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లింపునకు ఏర్పాట్లు

తెనాలిరూరల్: వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు ఆదివారం తమ కార్యాలయాల్లోని కేంద్రాలు పని చేస్తాయని విద్యుత్ శాఖ డీఈ వీవీ చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కేంద్రాలలో బిల్లు కౌంటర్లు ఉంటాయని చెప్పారు. ఏపీసీపీడీసీఎల్ మొబైల్ యాప్, సంబంధిత వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లులు సులభంగా చెల్లించవచ్చన్నారు.

మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలి



తాడికొండ: మూడేళ్లు దాటిన చిన్నారులందరినీ అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని ఐసీడీఎస్ తాడికొండ సెక్టార్ సూపర్‌వైజర్ కె.కృష్ణకుమారి సూచించారు. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా తాడికొండ వైసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలలో చిన్నారులను చేర్పించి, వారికి పూర్వ ప్రాథమిక విద్యను అందించడం ద్వారా పిల్లల్లో సమగ్ర వికాసానికి పునాదులు వేసినట్లవుతుందన్నారు. అంగన్‌వాడీ కిట్‌లు ప్రదర్శించి వాటి ఉపయోగాలను తెలియజేశారు. అనంతరం తల్లులు, పిల్లలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీలు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతతో పనిచేయాలి

ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పొన్నూరు: రక్షిత మంచినీటి పథకం నుంచి పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. నిడుబ్రోలు రక్షిత మంచినీటి పథకాన్ని, పరికరాల పనితీరును శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొన్నూరు పట్టణంలోని ప్రజల దాహార్తిని తీర్చేందుకు 100 ఎకరాల విస్తీర్ణంలో మంచినీటి చెరువును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొంతకాలంగా అధికారుల నిర్లక్ష్యం కారణంగా సమ్మర్ స్టోరేజ్ పథకం నిర్వాహణలో లోపం ఏర్పడిందన్నారు. మంచినీటి ప్లాంట్ నిర్వహణలో సిబ్బంది పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యమైన తాగునీటిని పట్టణ ప్రజలకు అందించే విధంగా పనిచేయాలని ఆదేశించారు. అధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని, తాగునీటి సరఫరాలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్, డీఈ ఏడుకొండలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

సమస్యలపై విస్తృత స్థాయి చర్చ

వట్టిచెరుకూరు మండల సర్వసభ్య సమావేశం

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఎంపీపీ చిలకా రాజ్యం అధ్యక్షతన మండల అభివృద్ధికి గత సమావేశంలో తీసుకున్న అజెండాను ప్రణాళికలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఎంఈవో సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని ప్రభుత్వ బడులకు పంపాలని కోరారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 3015 మంది విద్యార్థులు చదువుతున్నారని, అందులో 392 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ 46 అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు 3 ఉన్నాయని, మిగిలినవి అద్దె భవనాల్లో నడుస్తున్నట్లు తెలిపారు. మూడేళ్ల పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల నేపథ్యంలో గ్రామాల్లోని తాగునీరు ట్యాంకులు శుభ్రం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు తెలిపారు. ప్రతిరోజు ప్రజలకు వాటర్ పంపిణీ చేసే సమయంలో క్లోరినేషన్ చేయాలన్నారు. ఫీల్డ్ కిట్స్ ద్వారా మూడు శాంపిల్స్ తీసుకుని టెస్ట్ చేయాలని పంచాయతీ కార్యదర్శులను కోరారు. గ్రామాల్లో ఫిల్టర్ చేసిన వాటర్ మాత్రమే పంపిణీ చేయాలని సూచించారు. గ్రామాల్లో డయేరియా క్యాంపులు నిర్వహించాలని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. వ్యవసాయశాఖ అధికారి లక్ష్మి మాట్లాడుతూ వరి విత్తనాలు, పిల్లి పెసర సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కౌలు రైతులు సీసీఆర్ కార్డులు తీసుకోవాలని కోరారు. పీఎం కిసాన్ గురించి సమస్యలు ఏమైనా ఉంటే రైతు భరోసా కేంద్రాల్లో పరిష్కారం చేస్తామని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాభావ పరిస్థితి నెలకొందని, మరో నెలరోజులు వ్యవధిలో పంటలకు సాగునీరు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వెటర్నరీ అధికారులు మాట్లాడుతూ గేదెలకు గోంతువాపు నివారణకు, గొర్రెల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉందని తెలిపారు. హెల్త్ ఆఫీసర్ సుచిత మాట్లాడుతూ పుట్టిన వెంటనే పిల్లలకు టీబీ రాకుండా వ్యాక్సిన్ వేస్తున్నట్లు వివరించారు. అతిసార వ్యాధి నిరోధక చర్యలు జూన్ 1 నుంచి నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


డయేరియా నివారణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రాజ్యం

హ్యాకథాన్ పోటీల్లో ఆర్వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: తమ కళాశాల విద్యార్థుల ప్రతిభ నైపుణ్యాల ప్రదర్శనలకు లభించే పురస్కారాలతో కళాశాల కీర్తి జాతీయ స్థాయిలో దూసుకెళ్తుండటం ఎంతో గర్వకారణంగా ఉందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో ఐఈఈఈ సహకారంతో నిర్వహించిన జాతీయ స్థాయి 48 గంటల హ్యాకథాన్ పోటీల్లో ఐఓటీ డొమైన్ విభాగంలో తమ కళాశాల విద్యార్థులు ఘన శ్యామ్, ఎస్.ఆదిశయంబోస్, కె.నిఖిత, సీహెచ్ ఇంద్రజల జట్టు రూపొందించిన రిమోట్ హెల్త్ మానిటరింగ్ అనే పరికరం నూతన ఆవిష్కరణ ప్రదర్శనకు జాతీయ స్థాయిలో మొదటి స్థానం లభించిందన్నారు. కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తును అందించటం తమ కళాశాల లక్ష్యమని తెలిపారు. కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక రంగంలో నెలకొన్న పోటీ తత్వంలో నూతన ఆవిష్కరణలే దేశ ప్రగతికి కీలకంగా మారాయన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పోటీ ప్రదర్శనలో అనారోగ్యంతో బాధపడే వారికి సత్వర వైద్య సేవలకు తగిన సూచనలను అందించే దిశగా విద్యార్థుల పరిశోధన సాగిందన్నారు. వాయిస్ అసిస్టెంట్ కమాండ్ ద్వారా కూడా ఆరోగ్య సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని చెప్పారు. అతి తక్కువ వ్యయంతో రూపొందించిన పరికరం, ప్రతిభకు నిదర్శనమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, డాక్టర్ కె.కార్తీకపవన్ అవార్డు పొందిన విద్యార్థులను అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

వివాదాల నడుమ ఆలయ భూముల కౌలు వేలం

పెదకాకాని: ఇరు వర్గాల వివాదాల నడుమ శివాలయం భూములకు కౌలు వేలం పాటలు శనివారం నిర్వహించారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూములకు మూడేళ్ల పాటు కౌలు సాగు చేసుకునేందుకు బహిరంగ వేలాన్ని ఉప ఆలయ కమిషనర్ దాసర శ్రీరామవరప్రసాదరావు, దేవదాయశాఖ ఉప కమీషనర్, పాత గుంటూరు గ్రూపు దేవస్థానం కార్య నిర్వహణాధికారి ఎస్ఎల్‌టీ సొమ్యులు పర్యవేక్షించారు. పెదకాకాని శివాలయానికి చెందిన 17 ఎకరాల 95 సెంట్లు పొలం చేబ్రోలు మండలంలోని వీరనాయకునిపాలెం పరిధిలో ఉంది. అలానే పెదకాకాని మండలంలోని దేవరాయబొట్లవారిపాలెంలో అర ఎకరం(50 సెంట్లు) భూమి ఉంది. మూడు సంవత్సరాల కౌలు సాగు చేసుకునేందుకు వేలం పాటలు నిర్వహించగా గత సంవత్సరం కన్నా ఈ ఏడాది రూ.86,000లు అధిక ఆదాయం లభించినట్లు ఆలయ ఉప కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాద్ తెలిపారు. ఎకరాకు సంవత్సరానికి సుమారు రూ.29,383లు కౌలు చెల్లించే విధంగా వేలం దక్కించుకోవడం జరిగిందని డీసీ వివరించారు.

భూముల వేలంలో వివాదం..

గతంలో సాగు చేసుకుంటున్న ప్రస్తుతం వేలంలో పాల్గొనేందుకు వచ్చారు. ఆలయ అధికారులు సాల్వేషన్ సర్టిఫికెట్(ఆస్తి విలువ ధ్రువీకరణ పత్రం) లేదని, గతేడాది పాటనే తిరిగి కొనసాగించాలని వినతి పత్రం సమర్పించడం, ప్రతి ఏటా మార్చి 31 దాటిన తరువాత చెల్లించారనే కారణంతో వైఎస్సార్ సీపీ వర్గీయులను డిఫాల్టర్‌లుగా ప్రకటించారు. గతంలో పాటలో పాల్గొనేందుకు సాల్వేషన్ సర్టిఫికెట్ అడగలేదని, తాము డిపాజిట్ కట్టి వేలం పాటలో పాల్గొంటామని చెప్పినప్పటికీ బ్యాంకు ద్వారా డీడీ తీసిన వారిని పాట పాడుకునేందుకు అనుమతిస్తామని చెప్పడంతో ఇరు వర్గాల మధ్య వాదోపవాదనలు చోటు చేసుకున్నాయి. ఆలయ అధికారులు సమాచారం మేరకు పెదకాకాని పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో పాటలో పాల్గొనకుండా వైఎస్సార్ సీపీ వర్గీయులు వెనుతిరిగి వెళ్లిపోవాల్సి వచ్చింది. ఆలయ డీసీ దాసర శ్రీరామ వరప్రసాదరావును వివరణ కోరగా నిబంధనల ప్రకారమే వేలం పాటలు నిర్వహించడం జరిగిందన్నారు.


వేలం నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు, సిబ్బంది

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com